క్లుప్తంగా

మద్యం దుకాణాలను నియంత్రించాలని దీక్ష



మండల కేంద్రంలో దీక్ష చేస్తున్న మాలమహానాడు నాయకులు

అశ్వాపురం: మండలంలో మద్యం దుకాణాలు నియంత్రించాలని మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో రిలే నిరహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విచ్చలవిడిగా నడుపుతున్న మద్యం దుకాణాలు రద్దు చేయాలని, రెస్టారెంట్‌లలో మద్యం అమ్మకుండా నియంత్రించాలని అన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా కార్యదర్శి కాలువ సంసోన్, జిల్లా సహాయ కార్యదర్శి మేకల భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ములకలపల్లి: సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణా స్టేట్ బిల్డింగ్ కన్‌స్ట్రక్చర్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు వేల్పుల మల్లికార్జున్ అన్నారు. బొజ్జా వెంకటరెడ్డి అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. సంక్షేమ బోర్డుల్లో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. జీపీ కార్మికులకు వేలి ముద్రల విధానాన్ని తొలగించి, పాతపద్ధతినే కొనసాగించాలని పేర్కొన్నారు. అరవై ఏళ్లు దాటిన కార్మికులకు నెలకు రూ.3 వేలు పెన్షన్ ఇవ్వాలని, ప్రమాదవశాత్తూ మరణించిన కార్మిక కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎండి.యూసఫ్, రవి, సుబ్బారెడ్డి, చంటి, మోట రవి తదితరులు పాల్గొన్నారు.

9న సంతాప సభ

గుండాల: న్యూడెమోక్రసీ మండల కమిటీ దివంగత నాయకుడు ఎస్‌కె.అజ్గర్ జ్ఞాపకార్థం ఈనెల 9వ తేదీన గుండాల మండల కేంద్రంలో స్థూప ఆవిష్కరణ, సంతాప సభ ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, జిల్లా నాయకులు కొమరం సీతారాములు, మండల కార్యదర్శి ఆరేం నరేష్‌లు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన అత్యవసర మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిందిగా కోరారు. నాయకులు పర్శక రవి, యాసారపు వెంకన్న, ఈసం కృష్ణన్న, పెండేకట్ల పెంటన్న, మానాల ఉపేందర్, బానోత్ లాలు, పాయం ఎల్లన్న, కల్తీ నరసింహారావు, గొగ్గల శ్రీను, వజ్జ ఎర్రయ్య, పూనెం నరసన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి

దమ్మపేట: ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన మహిళ చిత్రపటానికి రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్(టీజీఐడీసీ) మువ్వా విజయబాబు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పూలతో ఘనంగా నివాళులర్పించారు. గురువారం మండలంలోని మొద్దులగూడెం గ్రామంలో టీజీఐడీ చైర్మన్ మువ్వా, ఎమ్మెల్యే జారేలు పర్యటించారు. అదే గ్రామానికి చెందిన దొడ్డా భారతమ్మ, ఇటీవలే మృతి చెందగా, ఆమె చిత్రపటానికి పూలతో నివాళులర్పించి, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పర్వతనేని ప్రసాద్, దొడ్డా భాస్కరరావు, సాయిల నర్సీ తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఎఫ్‌డీఓ మక్సూద్ మొహియుద్దీన్

మణుగూరురూరల్: తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజేఎఫ్ఓఏ) ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర డైరీలను మణుగూరు ఎఫ్‌డీఓ సయ్యద్ మక్సూద్ మొహియుద్దీన్ గురువారం వారి చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీజేఎఫ్ఓఏ మణుగూరు యూనిట్ అధ్యక్షుడు ఎఫ్ఎస్ఓ గోవింద్, ప్రధాన కార్యదర్శి ఎఫ్‌బీఓశ్యామ్, కోశాధికారి ఎఫ్‌బీఓ భీమ చందు, బాబురావు, ఎర్రయ్య పాల్గొన్నారు.

బియ్యం వితరణ

మణుగూరురూరల్: పట్టణానికి చెందిన మడిపల్లి రాము ఇటీవలే గుండెపోటుతో మరణించగా.. ఆ నిరుపేద కుటుంబానికి పినపాక నియోజకవర్గ పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం 50కేజీల బియ్యాన్ని వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ అసోసియేషన్ సభ్యులు ముజ్జు డాడి, సాయి, అమ్ములు శ్రీను, మధు, శ్రీనివాస్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఉద్యానవనం!

- కరువైన పచ్చదనం
- పార్కు చుట్టూ మొలిచిన పిచ్చి మొక్కలు
- పట్టించుకోని నిర్వాహకులు, అధికారులు



చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా పార్క్ పరిసరాలు



పార్క్‌లో స్వైరవిహారం చేస్తున్న పందులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణ వాసులతో పాటు పరిసర ప్రాంత గ్రామల ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఏకైక పార్కు పచ్చదనం లేక కళ కోల్పోయింది. బ్రిడ్జి సమీపంలోని పార్కులో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీని అభివృద్ధిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పార్కంతా పిచ్చి మొక్కలు, ఎండిపోయిన ఆకులు, తాగేసిన కొబ్బరి బొండాలతో పాటు పార్కులో పందులు కూడా స్వైరవిహారం చేస్తున్నాయి. దీనికి తోడు చీకటి పడిందంటే అసాంఘిక శక్తులకు పార్కు అడ్డాగా మారుతోందని పట్టణ ప్రజల నుంచి ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

పార్కులో టాయిలెట్స్ కూడా లేవు. పిల్లలు ఊయల ఊగే వస్తువుల నిర్వహణ లోపం కారణంగా వాటి లింకులు కూడా తెగిపోయిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యలను సంబంధిత పార్కు నిర్వాహకులతో పాటు అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని పార్కుకు వచ్చే మహిళలు వాపోతున్నారు. పార్కు చుట్టూ పిచ్చి మొక్కలతో నిండి ఉందని సాయంత్రం ఆరు గంటల తరువాత పార్కులో వెనుక భాగంలో కూర్చునే పరిస్థితి లేదని, అటువైపుకు వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తుందని సందర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్కు నిర్వాహకులు రోజు వారికి వచ్చే ఆదాయం మీద ఉండే శ్రద్ధ కొంచెం కూడా పార్కు అభివృద్ధిపై చూపడంలేదని సందర్శకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు పార్క్ నిర్వహకుల పై చర్యలు తీసుకుని పార్క్‌ను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

భద్రాచలంఅర్బన్: చైనా మాంజా వినియోగాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందని, భద్రాచలం డివిజన్ పరిధిలో ఎవరైన విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ సింగ్ హెచ్చరించారు. భద్రాచలం డివిజన్ పరిధిలో చైనా మాంజా విక్రయాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాంజా కారణంగా పక్షులు, ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు ప్రమాదాలబారిన పడే అవకాశం ఉందని, ప్రాణాలు సైతం పోయే అవకాశం కూడా ఉందని ఆయన వెల్లడించారు.

మణుగూరురూరల్: పతంగులను ఎగురేసే చైనా మాంజాలు వాడితే చర్యలు తప్పవని మణుగూరు ఎస్సై మేడ ప్రసాద్ హెచ్చరించారు. గురువారం మణుగూరు పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. చైనా మాంజాల వాడకం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. మంజా దారాలను ఎవరైనా అమ్మితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



చంద్రుగొండ: ఫ్యాన్సీ షాపులో తనిఖీ చేస్తున్న ఎస్ఐ శివరామకృష్ణ

దుకాణాల్లో తనిఖీలు

చంద్రుగొండ: పతంగుల కోసం ప్రమాదబరిత మాంజాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులకు ఎస్ఐ శివరామకృష్ణ హెచ్చరించారు. రామవరం ఘటన నేపథ్యంలో పోలీస్‌శాఖ అప్రమత్తమైన విషయ విదితమే. ఈ క్రమంలో గురువారం రాత్రి చంద్రుగొండలోని దుకాణాలపై పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ వ్యాపారులకు హెచ్చరికలు చేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన

అశ్వారావుపేటరూరల్: పలు చోట్ల జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆకస్మికంగా పరిశీలించారు. మండలంలోని అటవీ ప్రాంతంలోగల దత్తత గ్రామమైన చెన్నాపురం గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అలాగే కావడిగుండ్ల, గాండ్లగూడెం గ్రామాల్లో పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. అనంతరం అశ్వారావుపేట మండల కేంద్రంలో జరుగుతున్న మెగా డ్రెయినేజీ, రహదారి విస్తరణ పనులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డ్రెయినేజీ, రహదారి విస్తరణలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను త్వరతరగతిన తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానిక విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో ఎస్సై యయాతి రాజు, కాంగ్రెస్ ప్రముఖ నాయకులు జూపల్లి రమేష్‌బాబు, ప్రమోద్, నార్లపాటి దివాకర్ పాల్గొన్నారు.



అశ్వారావుపేటలో డ్రెయినేజీ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



భద్రాచలంటౌన్: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావ్

దుమ్ముగూడెం: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద యువతి తల్లిదండ్రులకు అండగా ఉంటుందని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు.గురువారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని 31 మంది లబ్ధిదారులకు దాదాపు రూ.31లక్షల విలువ గల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి ఒక్క నిరుపేద తల్లిదండ్రులకు అండగా ఉంటుందని అన్నారు. అనంతరం నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, గిర్దావర్ కల్లూరి వెంకటేశ్వరరావు, సీనియర్ సహాయకులు, కె.నరసింహారావు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ అన్నారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదింటి ఆడ పిల్లల పెళ్లికు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక భరోసాను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆర్ఐ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలను పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీరబాబు

దమ్మపేట: గత ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు ప్రారంభించి, ప్రస్తుతం అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను వెంటనే ప్రారంభించి, సకాలంలో పూర్తిచేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ మండల నాయకులు పండూరి వీరబాబు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన మాస్‌లైన్ మండల సమావేశంలో వీరబాబు మాట్లాడుతూ.. సర్వేల పేరుతో ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకుండా ప్రభుత్వం కాలాయాపన చేస్తోందని విమర్శించారు. మండల పరిధిలోని సమస్యలపై దృష్టి పెట్టి, అసంపూర్తి పనులను పూర్తిచేయాలని అన్నారు. కార్యక్రమంలో నాగమణి, ముక్తేశ్వరి, ఆశ, మాధవి, అనిల్ కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు పవర్ కట్

చర్ల: మండల కేంద్రమైన చర్లలో శుక్రవారం విద్యుత్ లైన్ మరమ్మతు పనుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ డి.వెంకటేశ్వరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏబీ స్విచ్ఛ్‌ల మెయింటినెన్స్, లైన్‌కు తాకుతున్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో మేజర్ పంచాయతీలోని అన్నీ కాలనీలతో పాటు లింగాపురంపాడు, రైస్‌పేట ప్రాంతాలకు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకొని సహకరించాలని ఆయన కోరారు.

సౌండ్ సిస్టం అందజేత

మణుగూరురూరల్: బార్ అసోసియేషన్ మణుగూరు అధ్యక్షులు మేదర మెట్ల శ్రీనివాసరావు తన తండ్రి మేదరమెట్ల నరసింహరావు జ్ఞాపకార్థంగా సౌండ్‌సిస్టంను మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ కె.సూరిరెడ్డి చేతుల మీదుగా గురువారం బార్ అసోసియేషన్‌కు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఏపీపీ లావణ్య, అంకం సర్వేశ్వరరావు, రుద్ర వెంకట్, కె నాగేష్‌కుమార్, పద్మావతి, వాగబోయిన రమేష్‌బాబు, నాగార్జున్‌రెడ్డి, మోహన్‌సాయి, సాంబశివరావు, కోర్ట్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిపై రక్షణ వలయం ఏర్పాటు చేయాలి

బూర్గంపాడు: గోదావరి బ్రిడ్జిపై రక్షణ వలయం ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు పున్నంచంద్ కోరారు. గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో గోదావరి బ్రిడ్జి పైనుంచి పలువురు గోదావరిలో దూకి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, నివారణకు బ్రిడ్జికి ఇరువైపులా రక్షణ వలయం ఏర్పాటు చేయాలని తెలిపారు.

జీపీ కార్యదర్శి పోస్టులు భర్తీ చేయాలి

దుమ్ముగూడెం: మండలంలోని దుమ్ముగూడెం, పర్ణశాల గ్రామ పంచాయతీ కార్యదర్శుల సాధారణ బదిలీల వల్లే ఏర్పడ్డ ఖాళీల వల్ల ప్రజాప్రయోజన కార్యక్రమాలకు ఆటంకం కలుగుతోందని బహుజన్ సమాజ్ పార్టీ నియోజక వర్గ కోశాధికారి, దుమ్మగూడెం మండల ఇన్‌చార్జ్ కొప్పుల నారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖాళీల వల్ల ఆయా ప్రాంతాలలో అభివృద్ధి కుంటుపడిందని, తక్షణమే నియామకాలు చేపట్టాలని అన్నారు.

సాయిబాబా మందిరంలో అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో వేంచేసియున్న శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా సాయినాథుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మణుగూరు పట్టణ ప్రముఖులు ఎస్‌కేటీ గ్రూప్స్ అధినేత దోసపాటి వెంకటేశ్వరరావు అండ్ బ్రదర్స్, వారి కుటుంబ సభ్యులు ఆలయంలోని సాయినాథుడిని దర్శించుకుని పూజ కార్యక్రమాలు చేశారు. అనంతరం ఎస్‌కేటీ గ్రూప్స్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం అన్నదాతలను ఆలయకమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు పాల్గొన్నారు.



మణుగూరురూరల్: అన్నదాతకు సన్మానం..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోని సాయిబాబా మందిరంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల అధినేత, సాయిబాబా సేవ సమితి ఆలయ మాజీ అధ్యక్షుడు దివంగత మాగంటి సూర్యం జ్ఞాపకార్థం వారి కుమారులు మాగంటి ప్రసాద్, రమేష్‌బాబులు భక్తులకు అన్న వితరణ కార్యక్రమం నిర్వహించి, అనంతరం సరోజిని వృద్ధాశ్రమంలో సుమారు 120 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు తుమ్మలపల్లి సత్యనారాణమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కాగా, సాయిబాబా వారి మందిరాన్ని ప్రముఖ తెలుగు సినీ డైరెక్టర్ సుకుమార్ సోదరుడు విజయ్ గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువతో సత్కరించి బాబావారి జ్ఞాపికతో పాటు ప్రసాదం అందజేశారు.

వరాహావతారంలో పర్ణశాల రాముడు

దుమ్ముగూడెం: వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా మూడో రోజు గురువారం పర్ణశాల రామయ్యను వరాహావతారంలో ఆలయ అర్చకులు అలంకరించారు. అర్చకులు ప్రత్యేక పూజల అనంతరం వరాహావతారంలో అలంకరించి, ఆ అవతార విశిష్టతను వివరించారు. మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కె.కల్యాణి బృందం శ్రీనివాసకల్యాణం హరికథా కాలక్షేపం నిర్వహించింది. సాయంత్రం పర్ణశాల పురవీధులగుండా తిరువీధి సేవ చేపట్టారు. కార్యక్రమాల్లో ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, భార్గవాచార్యులు, వేదపండితులు మల్లూరు రవికుమార్ శర్మ, నాలదీగల నరసింహాచార్యులు, వెంకటాచార్యులు, భరద్వాజచార్యులు, ఆలయ సిబ్బంది శివ, రాము తదితరులు పాల్గొన్నారు.



వరాహావతారంలో దర్శనం ఇస్తున్న పర్ణశాల రామయ్య

వైభవంగా మాలధారుల ఇరుముళ్లు



ఇరుముళ్లతో శబరిమలైకు బయలుదేరిన అయ్యప్ప దీక్షాపరులు

చర్ల: మండలంలోని దండుపేటలో గల అయ్యప్ప స్వామి ఆలయం వద్ద గురువారం నిర్వహించిన ఇరుముళ్ల కార్యక్రమం వైభవంగా సాగింది. అయ్యప్ప మాలధారుణ చేసిన దీక్షపరులు 40 రోజుల పాటు దీక్షలు కొనసాగించి శబరిమలైకు పయణమయిన క్రమంలో ఇరుముళ్లు కట్టుకొని బయలుదేరారు. ఈ సందర్భంగా దేవాలయంలో గురుస్వాములు దీక్షాపరులకు ఇరుముళ్లు కట్టారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం అంతా స్వాములు చేసిన అయ్యప్ప నామస్మరణలతో మారుమోగింది. అనంతరం చర్లలో ఇరుముళ్లతో స్వాములు శోభాయాత్రను నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వాములను దర్శించి వీడ్కోలు పలికారు.

విద్యార్థులకు రగ్గుల పంపిణీ

మణుగూరుటౌన్: గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మణుగూరు జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్ విద్యార్థులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతులమీదుగా రగ్గులు, గిఫ్ట్ ప్యాకెట్లు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెలే పాయం మాట్లాడుతూ.. గ్రేస్ సర్వీస్ సొసైటీ వారు అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ పేద, తల్లిదండ్రులు లేని పిల్లలను చదివిస్తూ నిరుపేద కుటుంబాలకు ఉచిత విద్యను అందిస్తున్న సొసైటీ అధ్యక్షుడు ఎంఎల్ ప్రసాద్‌ను అభినందించారు. ఎంఈఓ స్వర్ణలత, హెచ్ఎం నాగజ్యోతి, మండల కాంగ్రెస్ నాయకులు నవీన్, మహిళ నాయకులు పాల్గొన్నారు.



మణుగూరుటౌన్: విద్యార్థులకు రగ్గులు, గిఫ్ట్ ప్యాకెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం

క్యాలెండర్లు ఆవిష్కరణ

అశ్వాపురం: మణుగూరులో క్యాంప్ కార్యాలయంలో మొండికుంట బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కమటం వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి అనంతనేని సురేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, నాయకులు సర్వ కృష్ణ, పసుల ప్రభాకర్, శ్రీను, దేవేంద్రం, సతీష్, అంజిరెడ్డి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి స్పోర్ట్స్, డార్క్ లెవెన్ విజయం



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో తాళ్లూరి భారతి దేవి స్మారక నెహ్రూ కప్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం జరిగిన పోటీలలో భద్రాద్రి స్పోర్ట్స్, డార్క్ లేవన్ కొత్తగూడెం జట్లు విజయం సాధించాయి. ఉదయం జరిగిన మ్యాచ్లో ముందుగా బ్యాటింగ్ చేసిన గని లెవెన్ జట్టు నిర్ణీత 18 ఓవర్లలో 93 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యారు. 94 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన భద్రాద్రి స్పోర్ట్స్ జట్టు 13 ఓవర్లలో 95 పరుగులు చేసి విజయం సాధించింది. మధ్యాహ్నం జరిగిన రెండవ మ్యాచ్‌లో కొత్తపేట జట్టుపై డార్క్ లెవెన్ కొత్తగూడెం జట్టు విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన డార్క్ లెవెన్ జట్టు 19 ఓవర్లలో 132 పరుగులు చేశారు. 133 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన కొత్తపేట జట్టు 16 ఓవర్లలో 95 పరుగులు చేసి ఆల్ అవుట్ అయింది. ఈ మ్యాచ్‌లో రాణించిన క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో నాగరాజు, ఎస్‌కె.అజీమ్, తోటమల్ల వెంకట బాలయోగి, శ్రీధర్, శ్రీనివాసరావు, శ్రీనివాస రాజు, ఎస్కే సలీం, సదానందం, నాగార్జున, ఉదయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ హమాలీల సమ్మె

భద్రాచలంఅర్బన్: అక్టోబర్ 2024లో జరిగిన జీసీసీ సివిల్ సప్‌లై రేట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జీసీసీ హమాలీ వర్కర్స్ మెరుపు సమ్మెకు దిగారు. సమ్మెను సీఐటీయూ పట్టణ ఇన్‌చార్జ్ నాయకుడు గడ్డం స్వామి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ నాయకులు నకిరికంటి నాగరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లై జీసీసీ హమాలీ కార్మికుల ఎగుమతి, దిగుమతి రేట్ల విషయమై గత మూడు నెలల క్రితం 2024 అక్టోబర్3న అన్ని కార్మిక సంఘాల సమక్షంలో సివిల్ సప్‌లై కమిషనర్, అధికారులు చర్చలు జరిపారని, పాత రేట్ల కంటే అదనంగా మూడు రూపాయలు దిగుమతి, ఎగుమతి రేట్లు పెంచారన్నారు. పెంచిన రేట్లను అమలు చేస్తామని, ఏరియర్స్‌తో కలిపి చెల్లిస్తామని సివిల్ సప్లై అధికారులు హామీ ఇచ్చి నేటికీ నెరవేర్చకపోవడాన్ని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు అజయ్ కుమార్, రాములు, జీసీసీ హమాలీలు సుబ్రహ్మణ్యం, ప్రసాదు, శేషు, లోకేష్, రామారావు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: సివిల్ సప్లయిస్, జీసీసీ హమాలీ కార్మికులు ఎగుమతి, దిగుమతికి సంబంధించిన నూతన రేట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని జీసీసీ హమాలీ, ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్స్ ఆధ్వర్యంలో గురువారం నిరవధిక సమ్మె చేపట్టారు. రిలే నిరహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాత రేట్ల ఒప్పందం ముగిసినందున 2024–25 సంవత్సరానికి సంబంధించిన నూతన రేట్లను పెంచాలన్నారు. 3 నవంబర్ 2024న అన్ని కార్మిక సంఘాల సమక్షంలో చర్చలు జరిపి ఎగుమతి, దిగుమతి నూతన రేట్లను రూ.26 నుంచి రూ.29కి పెంచేందుకు అంగీకారం కుదిరిందని కాని వాటిని నేటికీ అమలు పరచలేదన్నారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు చిరునాగుల ఐలయ్య, లింగయ్య, ఉప్పలయ్య, కారం శ్రీను, లింగారెడ్డి, కనతాల అశోక్, మహేష్, లక్ష్మణరావు, కాటిబొయిన శ్రీను, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



అశ్వాపురం: మండల కేంద్రంలో దీక్ష చేపడుతున్న హమాలీలు